క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతన పెంచుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని ఆధ్యాత్మిక ప్రసంగీకుడు బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ పేర్కొన్నారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆయన మంగళవారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. 18వ తేదీ వరకు ఈ ఆధ్యాత్మిక ప్రసంగాలు ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్‌బాలాజీ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

ప్రొద్దుటూరు క్రైం : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే జిల్లా ఆస్పత్రికి విచ్చేసి పలు విభాగాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా డయాలసిస్ విభాగాన్ని పరిశీలించారు. అందులోని పేషెంట్లతో మాట్లాడి సౌకర్యాలు, అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వసతులపై మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో ఎమ్మెల్యే మాట్లాడారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలి

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ఈనెల 20న పట్టణంలో ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రొద్దుటూరు : కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం పట్టణంలో రెండు రోజులపాటు సీపీఎం, సీఐటీయూ, మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించినట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పట్టణంలోని మైదుకూరు రోడ్డు, టీబీ రోడ్డు, గాంధీ రోడ్డు, బంగారంగళ్ల వీధి తదితర ప్రాంతాల్లో వరద బాధితుల కోసం రూ.45 వేలు విరాళాలు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విరాళాలను కేరళ రాష్ట్రానికి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, సాల్మన్, రాఘవ, బాలసుబ్బయ్య, శేఖర్, ముంతాజ్, చెన్నారెడ్డి, ప్రమీలమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, సీతమ్మ, సర్వేశ్వరి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోండి

అట్లూరు : పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.నాగరాజ పేర్కొన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాటంవారిపల్లె గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాగు చేసిన, సాగు చేయబోయే పంటల గురించి, వాటి సస్యరక్షణపై వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

చాపాడు : దేశం, ధర్మం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధి చియ్యపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు – విలువలు అనే అంశంపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 వంశీకృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు వివేకానందుడి విజయానికి మార్గం అనే పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకట సురేష్, శ్రీనాథ్, పాఠశాల హెచ్ఎం తిరుపాల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం స్థానిక ప్రాథమిక వైద్య అధికారులు విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ ఎస్.పుష్పరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, ల్యాబ్‌టెక్నీషియన్ రమణకుమార్, హెల్త్‌అసిస్టెంట్లు మాధవనాయుడు, వెంకటసుబ్బయ్య, ఏఎన్ఎంలు జ్యోత్స్న, సీహెచ్ఓ ప్రియాంక, ఆశా వర్కర్లు సుశీలమ్మ, రంగనాయకులమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాల సీజ్

ప్రొద్దుటూరు క్రైం : ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల వాహనాలను సీజ్ చేస్తామని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. విద్యాసంస్థల వాహనాలపై ఆర్టీఓ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మూడు బృందాలుగా ఏర్పడి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల్లో మంగళవారం ఏక కాలంలో విద్యాసంస్థల వాహనాలను తనిఖీ చేశారు. ట్యాక్స్ చెల్లించని వాహనాలకు జరిమానా విధించారు. వివిధ రకాల 12 కేసులు నమోదు చేసినట్లు ఆర్టీఓ తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు నారాయణనాయక్, రవీంద్రనాయక్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



బద్వేలులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, బీజేపీ శ్రేణులు



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

బద్వేలు అర్బన్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు విద్యార్థులు జాతీయ జెండాను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, కడప పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి భారతీయునిలో దేశభక్తి పెంపొందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొజ్జారోశన్న, ఉట్టిశ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

మైదుకూరు : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగాపై మంగళవారం మైదుకూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక కడప రోడ్డు నుంచి రాయల కూడలి మీదుగా మార్కెట్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు జాతీయ పతాకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాచనూరు సుబ్బరాయుడు మాట్లాడుతూ మంగళవారం నుంచి స్వాతంత్ర్య దినోత్సవం వరకు దేశ స్వాతంత్ర్యానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగువేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారని తెలిపారు. జాతీయ జెండా ఎగురవేయడాన్ని ప్రోత్సహించేందుకే ఈ ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు డివిజన్ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న పట్టణంలో నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాజీ సైనికులు, వీరనారీమణులు పాల్గొనాలని సంఘం అధ్యక్షుడు నేట్ల బాలవీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం 7 గంటలకు గాంధీ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పించి అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి టీబీ రోడ్డులో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళి అర్పించి, అక్కడి నుంచి వెళ్లి అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఎగ్జిబిషన్ మైదానంలో జాతీయ జెండా వందనం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పంద్రాగస్టును ప్రొటోకాల్ ప్రకారం నిర్వహించాలి

బ్రహ్మంగారిమఠం : 15న పంద్రాగస్టు సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రొటోకాల్ ప్రకారం వేడుకలు నిర్వహించాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యులు, మండల పరిషత్‌లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొని జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రొద్దుటూరులో పని చేయడం గొప్ప అనుభూతి

- డీఎస్పీ మురళీధర్



డీఎస్పీ మురళీధర్‌ను సన్మానిస్తున్న జమ్మలమడుగు డీఎస్పీ హుసేన్‌పీరా

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో పని చేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఆయన బదిలీ సందర్భంగా ఎస్‌డీపీఓ కార్యాలయంలో మంగళవారం రాత్రి సన్మాన వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ గడచిన సార్వత్రిక ఎన్నికలను పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించామన్నారు. పోలీసు శాఖలో నమ్మకం అనేది చాలా ముఖ్యమని తెలిపారు. మనపై ఎంతో నమ్మకంతో ప్రజలు పోలీసుస్టేషన్‌కు వస్తుంటారని, వారికి న్యాయం చేసి పంపించడం మన బాధ్యత అని చెప్పారు. మరో 45 రోజుల్లో తాను పదవీ విరమణ చేయనున్నానని, ప్రభుత్వ పాలసీలో భాగంగా ఇక్కడి నుంచి బదిలీ అయినట్లు తెలిపారు. తనకు ఇది 23వ బదిలీ అని తెలిపారు. కర్నూలు జిల్లాలోని ఫ్యాక్షన్ ప్రాంతాల్లో పని చేయడం సర్వీసులో మరచిపోలేనన్నారు. పోలీసు శాఖలో చేరినప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నానో ఇప్పుడు కూడా అంతే ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎస్పీ హుసేన్‌పీరా, ప్రొద్దుటూరు సీఐలు రమణారెడ్డి, యుగంధర్, వెంకటరమణ, ఎస్ఐలు మహ్మద్‌రఫి, శ్రీనివాసులు, భాస్కర్, సబ్ డివిజన్‌లోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామంలో పాఠశాలను తెరిపించండి



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న కమలకూరు బీసీ కాలనీ వాసులు

అట్లూరు : తమ గ్రామంలో మూతపడిన పాఠశాలను తెరిపించాలని కమలకూరు బీసీ కాలనీ వాసులు పేర్కొన్నారు. వారు మంగళవారం ఆ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమలకూరు బీసీ కాలనీలో వడ్డెర కులానికి చెందిన 150 కుటుంబాలు జీవిస్తున్నట్లు తెలిపారు. తమ పిల్లల చదువుల కోసం గతంలో ప్రాథమిక పాఠశాల ఉండేదని, అయితే విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలను మూసివేశారని పేర్కొన్నారు. దీంతో గత్యంతరం లేక పట్టణాల్లోని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నామని తెలిపారు. కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే వారమని, పిల్లల ఫీజులు చెల్లించలేకున్నామని, అధికారులు మా గ్రామంలోని పాఠశాలను పరిశీలించి పునఃప్రారంభించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టరకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఉపాధి పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం

- ఉపాధి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ
- ఫీల్డ్ అసిస్టెంట్లపై టీడీపీ వర్గీయుల ఫిర్యాదు



ఉపాధి హామీ బహిరంగ సభలో ఏపీడీతో వాదిస్తున్న చియ్యపాడు టీడీపీ వర్గీయులు

చాపాడు : ఉపాధి హామీ పథకం నిర్వహణలో పారదర్శకతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కూలీలకు పనులు కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరత్నమ్మ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1338 పనులకు గాను రూ.7.13 కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేయటం జరిగిందన్నారు. ఈ పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.22,664లు అవకతవకలు జరుగగా రికవరీ చేయటం జరిగిందన్నారు. మండలంలోని పల్లవోలు, అన్నవరం, అల్లాడుపల్లె, చాపాడు, చియ్యపాడు, సీతారామాపురం గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతూ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని, వీరిపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు తమ వర్గీయులతో వచ్చి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులన్నీ పరిశీలిస్తామని ఏపీడీ చెప్పారు. అన్నవరంలో డ్వాక్రా యానిమేటర్ ఉపాధి పనులు చేస్తుందని ఫిర్యాదు చేయగా.. చిరు ఉద్యోగులు ఉపాధి పనులు చేసుకోవచ్చని తెలిపారు. అల్లాడుపల్లెలో కూలీల సంతకాలు ఫోర్జరీ చేశారని మళ్లీ విచారణ చేపట్టాలని, చియ్యపాడులో బహిరంగ సభ విషయాన్ని దండోరా వేయించలేదని ఆ గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఏపీడీతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెలిదేల లక్ష్మయ్య, మైదుకూరు డివిజన్ ఏపీ జుబేదా, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఉపాధి ఏపీఓలు జగదీశ్వర్‌రెడ్డి, పద్మారాణి, ఈసీలు ప్రియాంక, రాజ, పీఆర్ రిటైర్డు ఏఈ ఈశ్వరయ్య, ఎస్ఆర్‌పీ కన్నా, సీసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో లిఫ్ట్ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక కోర్టులో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజా పక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పక్షం ప్రెసిడెంట్ పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ కోర్టు భవనంలో మొదటి అంతస్తులో జిల్లా రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రెండో అంతస్తులో మొదటి అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కోర్టు విధులు నిర్వహిస్తున్న వారు, కక్షిదారులు లిఫ్ట్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం ఆర్అండ్‌బీ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం నాయకులు అబ్దుల్ రహీమ్, మల్లికార్జునశెట్టి, నరాల బాలిరెడ్డి, మార్తల శ్రీనివాసులరెడ్డి, యోహాన్, ఓబుళరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తీరుతో పేదలకు ఇక్కట్లు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల విద్యుత్ అధికారులు, లైన్‌మెన్లు పేద, మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి అన్వర్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ధనవంతులు, పలుకుబడి కలిగిన పెద్దల విద్యుత్ బిల్లులు వేలకు వేలు బకాయిలు పేరుకుపోయినా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది.. పేదల బిల్లు నెల దాటితే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారన్నారు. సమావేశంలో సలీం, ముజాహిద్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

బద్వేలు అర్బన్ : గోపవరం సమీపంలోని సెంచరీ పానెల్స్ పరిశ్రమలో అధిక శాతం ఉద్యోగాలు స్థానిక యువతకే కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమ ప్రారంభించే సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కోరారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలో ఉద్యోగాలు పొందిన వారిని తొలగించే క్రమంలో.. మానుకోవాలని ఒత్తిడి తీసుకురావడం సరైంది కాదన్నారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఇవ్వడం దారుణమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి స్థానికులకు ఉద్యోగ అవకాశాల్లో పెద్దపీట వేయడంతోపాటు గతంలో పనిచేస్తున్న వారందరిని కొనసాగించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, పట్టణ ఉపాధ్యక్షుడు ఆదిల్, సురేష్, సహాయ కార్యదర్శి ఖలీల్, మహబూబ్‌పీర్, శివ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలల్లో న్యాయమూర్తి తనిఖీలు



మైదుకూరు : విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి హారిక

మైదుకూరు/చాపాడు/ఖాజీపేట : మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని కస్తూర్బా పాఠశాలల్లో మంగళవారం మైదుకూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.హారిక ఆకస్మిక తనిఖీలు చేశారు. రాష్ట్ర న్యాయ సేవా సమితి ఆదేశాలతో ఖాజీపేట, మైదుకూరు, దువ్వూరు, చాపాడు మండలాల్లోని కస్తూర్బా పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, భోజనం, మరుగుదొడ్లు, భద్రత, వైద్య సేవల గురించి ఆరా తీశారు. మైదుకూరు పాఠశాలను తనిఖీ చేసేందుకు న్యాయమూర్తి వచ్చిన సందర్భంలో.. ఓ విద్యార్థిని పారక పట్టుకొని పరిసరాలను శుభ్రం చేస్తూ కనిపించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి ఎస్ఓ (స్పెషల్ ఆఫీసర్) నిర్మలను మందలించారు. చదువుకునేందుకు పాఠశాలకు వచ్చిన విద్యార్థినులతో పనులు చేయిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజీపేట కస్తూర్బా పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినుల భద్రత కరువైందని అక్కడి ఉపాధ్యాయులు న్యాయమూర్తికి తెలిపారు. న్యాయమూర్తి వెంట కోర్టు అధికారులు రమణారెడ్డి, వీరభద్ర, గంగమ్మ, ప్యానల్ న్యాయవాదులు సోమేసుల శివ, నాగిరెడ్డి, కామనూరు శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల వెంకటయ్య ఉన్నారు.

పేదలకు భూ పంపిణీ చేపట్టాలి

పోరుమామిళ్ల : అక్కలరెడ్డిపల్లె, కృపానగర్ గ్రామాలకు చెందిన పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ కోరారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అక్కలరెడ్డిపల్లె పొలం 1854 సర్వే నంబర్‌లో 120 ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదలు చెట్లు కొట్టి సాగులో పెట్టారని, ఆ భూములు పంపిణీ చేయాలని కోరారు. లచ్చంపల్లెలో 150 ఎకరాలను కొందరు ఆక్రమించుకున్నారని, స్వాధీనం చేసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్య, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, సుదర్శన్, భూపోరాట కమిటీ సభ్యులు కిరణ్, రవిబాబు, సుబ్బరాయుడు, సాలమ్మ, భారతి పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే గ్రామంలోనే పెద్దల సమక్షంలో పరిష్కరించుకుని నందిపల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు సూచనల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నందిపల్లె గ్రామంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రేమాభిమానాలతో జీవించాలని, ఏవైనా సమస్యలు వస్తే లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకుని సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. సదస్సులో సీనియర్ న్యాయవాది డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, ప్రభుత్వ న్యాయవాది సూర్యనారాయణరెడ్డి, న్యాయవాది శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది, రూరల్ పోలీసుస్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా పట్టించుకోరేం?



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

ప్రొద్దుటూరు : ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. మంగళవారం మండలంలోని పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏరియా జనరల్ బాడీ సమావేశం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ జ్వరపీడితులు వైద్య పరీక్షలకు వేల రూపాయలు దారపోసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. పన్నులపై ఇష్టానుసారంగా ఆయా ప్రాంతాలను బట్టి పెంపుదల చేసి సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. ఈ విషయంపై ఈనెల 19న జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్, నగర పంచాయతీ కార్యాలయాల ఎదుట సీపీఐ శ్రేణులు ఆందోళన చేయాలని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రొద్దుటూరు పాలకేంద్రం తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, వెంకటశివ, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, హరి, ప్రమీల, వీరయ్యశెట్టి, శీను తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ

పోరుమామిళ్ల : చెత్తను సంపదగా మార్చుకోవడం వల్ల పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని ఎంపీడీఓ వరప్రసాదరావు పేర్కొన్నారు. కార్యదర్శులు, సర్పంచులకు రెండో రోజైన మంగళవారం శిక్షణ సందర్భంగా చెత్త నుంచి సంపద ఎలా సమకూర్చుకోవాలో అవగాహన కల్పించారు. రంగసముద్రం పంచాయతీలో సంపద తయారీ కేంద్రంలో హరిత రాయబారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజీవ్‌రెడ్డి, రంగసముద్రం, పోరుమామిళ్ల సర్పంచులు రవిప్రకాష్‌రెడ్డి, సుధాకర్, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

గోపవరం : పారిశుద్ధ్యం మెరుగుపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, హరితరాయబారులకు రెండవ రోజు శిక్షణా కార్యక్రమం బేతాయపల్లె ఎస్‌డబ్ల్యూసీ కేంద్రంలో నిర్వహించారు. ఈఓపీఆర్డీ హసీనా, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులరెడ్డి, మోశ, నిఖిత, సుబ్బారావు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయన : మండలంలోని నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో సర్పంచ్‌లకు శిక్షకుడు రామకృష్ణారెడ్డి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం చెత్త సంపద కేంద్రాన్ని సర్పంచ్‌లతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఖాజీపేట : ఖాజీపేటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పరిశీలనా కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్‌లు చంద్రశేఖర్, పల్లె యేసురత్నం, చిన్నారెడ్డితోపాటు ఈఓపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి పంచాయితీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్పంచ్‌లు, క్లాప్ మిత్రలు హాజరయ్యారు. శిక్షకులు ధనేశ్వర్ బాబు, సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

ప్రొద్దుటూరు : మండలంలోని చెన్నమరాజుపల్లెలో రెండో రోజైన మంగళవారం చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్టేట్ అబ్జర్వర్ ఎ.రమేష్, జమ్మలమడుగు డీఎల్‌పీఓ విజయభాస్కర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త ఎలా వేరు చేయాలి, చెత్తను ఎలా సేకరించాలో వివరించారు. ఎంపీడీఓ కె.కుళ్లాయమ్మ, ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.